క్లుప్తంగా

పీఎంఏవై సాయం అందించాలి

బోట్‌క్లబ్: సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే పేదలకు ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న ఆర్థిక సాయాన్ని వెంటనే అందించేలా చూడాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టర్ కృతికా శుక్లాకు ఆయన వినతిపత్రం అందజేశారు. వికసిత భారత్ సంకల్ప యాత్రలో పాల్గొంటున్న తమకు పేదలు తమ గోడు వివరించారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద చిన్న స్థలాలు ఉంటే సొంత ఇల్లు నిర్మించుకునే వారికి ప్రతి ఇంటికి రూ.1,80,000 ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. ఈ సహకారం అందేలా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రవి కిరణ్ డిమాండ్ చేశారు.

మామిడిచెట్ల ఫలసాయానికి నేడు బహిరంగ వేలం

కరప: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మామిడిచెట్ల ఫలసాయానికి శనివారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆధీనంలో ఉన్న పీహెచ్‌సీ ఆవరణలో 14 మామిడి చెట్లు ఉన్నాయని, వీటి ఫలసాయం పొందేందుకు కరప గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు వేలంపాట నిర్వహిస్తారన్నారు. రూ.8 వేల కనిష్ఠ ధరగా నిర్ణయించామని, పాటలో పాల్గొనేవారు రూ.వెయ్యి ప్రథమ ధరావత్తుగా చెల్లించాలన్నారు. పాట పూర్తయిన వెంటనే పాట సొమ్ము పూర్తిగా చెల్లించాలన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



వేమన చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పార్థసారధి, రత్నప్రసాద్

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పార్థసారధి, అడబాల రత్నప్రసాద్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమన పద్యాలు నేటి తరానికి ఉపయుక్తమన్నారు.

రేపు నల్లగొండమ్మ బోనాల మహోత్సవం



నల్లగొండమ్మతల్లి

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన నల్లగొండమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఎస్.అన్నవరం, కొత్తూరు సూరవరం గ్రామాలకు చెందిన మహిళా భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా 'అత్తిలి'

కిర్లంపూడి: విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా పని చేస్తున్న అత్తిలి వీరబ్రహ్మం కాకినాడ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సంఘ రాష్ట్ర స్థాయి నాయకుల సమక్షంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు చెప్పారు. గానుగుల శ్రీనివాస్, కొత్తల ప్రసాద్, లక్కోజు కోటేశ్వరరావు, పలువురు సంఘ సభ్యులు వీరబ్రహ్మంకి శుభాకాంక్షలు తెలిపారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

తుని: ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఈ నెల 23న తుని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున జరిగే గిరి ప్రదక్షిణకు బస్సు సర్వీసు నడుపుతున్నట్లు చెప్పారు. టిక్కెట్టు ధర రూ.3,500గా నిర్ణయించారు. టిక్కెట్లు కావాల్సిన భక్తులు 73829 13216, 73829 13016, 73829 21904 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్యదేవుని దర్శించిన కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ

అన్నవరం: కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నందూరి శుక్రవారం సాయంత్రం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

నైట్ సర్వీస్ లేక
నానా తిప్పలు

- పునరుద్ధరించాలంటున్న ప్రయాణికులు
- కలెక్షన్లు లేవని నడపలేమన్న అధికారులు
- జేబులకు చిల్లులు పెడుతున్న ఆటో డ్రైవర్లు



కాకినాడ-రావులపాలెం పల్లెవెలుగు బస్సు

కరప: కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరే పల్లె వెలుగు నైట్ బస్సు రద్దు చేయడంతో పలు గ్రామాల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అన్ని ప్రాంతాలకు రాత్రి 10 నుంచి 10.30 గంటల మధ్య లాస్ట్ ట్రిప్ నడుపుతుంటే కరప మండలం మీదుగా రావులపాలెం వెళ్లే పల్లె వెలుగు సర్వీసును మాత్రం అధికారులు నిలిపివేశారు. కరప మండలంలోని వేళంగి, కూరాడ, సిరిపురం, జి.భావారం, పెదకొత్తూరు, వాకాడ, వేములవాడ, వలసపాకల, కరప, పేపకాయలపాలెం, కాండ్రేగుల, శహపురం, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, పెనుగుదురు, నడకుదురు గ్రామాల నుంచి వైద్యం, ఉద్యోగం తదితర పనులపై నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో కాకినాడ డిపో నుంచి రావుపాలేనికి రాత్రి 10 గంటలకు, పైన గ్రామానికి రాత్రి 10.30 గంటలకు బయలుదేరేవి. ఈ బస్సులు రెండూ కరప మీదుగా వెళ్లేవి. వీటివల్ల నాలుగైదు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉండేది. పగటి సమయంలో రావులపాలెం వెళ్లే బస్సులు ఒకే సమయంలో వరసగా రెండు, మూడు ఒకదాని వెనుక ఒకటి తిరుగుతుంటాయి. దీంతో కలెక్షన్లు లేవన్న వంకతో ఆఖరి బస్సు రద్దు చేశామని అధికారులు చెప్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసం అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

ఈ ట్రిప్ రద్దుతో ప్రధానంగా భానుగుడి, నూకాలమ్మగుడి, కుళాయిచెరువు ప్రాంతాల నుంచి వెళ్లేవారు జగన్నాథపురం వంతెనకు వెళ్లేందుకు రెండు ఆటోలు మారి, అక్కడ నుంచి మరో ఆటోలో వెళుతుండటంతో జేబులు ఖాళీ అవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేదంటే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కి, కండక్టర్‌ను బతిమాలి రామచంద్రపురం టికెట్ తీసుకోవాల్సి వస్తోందని వారు తెలిపారు.

అటు కత్తిపూడి, తునివైపు, సామర్లకోట, రాజమహేంద్రవరం వైపు వెళ్లేందుకు రాత్రి 10 గంటలకు కూడా తిరుగుతున్నాయి. రావులపాలెం వెళ్లే బస్సు మాత్రమే రద్దు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కాకినాడ నుంచి రావులపాలెం వెళ్లే లాస్ట్‌బస్‌ను పునరుద్ధరించాలని మండల వాసులు కోరుతున్నారు.

40 మంది ఉంటేనే..

పల్లె వెలుగు బస్సులు రాత్రి 9 గంటల వరకే నడుపుతున్నాం. రాత్రి 9 గంటల తర్వాత ప్రయాణికులు ఉండటం లేదు. నలుగురైదుగురి కోసం బస్సు నడపలేం. కనీసం 40 మంది ప్రయాణికులుంటే కానీ నైట్‌ట్రిప్ తిప్పలేం.

– మనోహర్, ఆర్టీసీ డిపో మేనేజర్, కాకినాడ

కులగణన సమగ్రంగా నిర్వహించాలి



అరట్లకట్టలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, కార్యదర్శి తదితరులు

కరప: మండల పరిధిలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేపట్టిన కులగణన సర్వే ఇంటింటికీ వెళ్లి ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా కులగణన సర్వే సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. మండలం అరట్లకట్ట గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి కులగణన సర్వేను ప్రారంభించి, ఎన్యూమరేటర్లకు సర్వే ఎలా నిర్వహించాలో తెలియజేశారు. కులగణన సర్వే అనేది రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లెక్కలకు మాత్రమేనని, దీనివల్ల ఎవరికీ ఎటువంటి హానీ జరగదని తెలియ జేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అప్పారావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో కులగణన సర్వే ప్రారంభించడం జరిగిందని, ఈ నెల 28వ తేదీలోపునే పూర్తిచేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నామన్నారు. సర్పంచ్ గోపి సత్యవేణి, గ్రామకార్యదర్శి వి.సునీల్‌కుమార్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ కార్పొరేట్ వైద్యం

- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



అరట్లకట్ట వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కరప: మండలం అరట్లకట్ట లోని సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ గోపి సత్యవేణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ కార్పొరేట్‌స్థాయి వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని పేర్కొన్నారు. కాకినాడ డివిజనల్, మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యం చేయించుకున్న వారిని కలసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకుని అవసరమైన వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. వీరితో పాటు కొత్తవారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇచ్చామన్నారు. వైద్య శిబిరానికి 189 మంది పురుషులు, 123 మంది మహిళలు రాగా వైద్యులు ప్రసాద్, బి.అరుణకుమారి, యాంజిలిన్ వైద్య సేవలందించారు. వైద్య సిబ్బంది వై.రత్నకుమారి, టీబీటీ సుందరి తదితరులు డెంగీ, మలేరియా, బీపీ, షుగర్, హెచ్‌బీ తదితర వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. నలుగురికి కంటి ఆపరేషన్లు చేయాలని గుర్తించి, కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేసినట్టు డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఎంపీడీఓ కె.అప్పారావు, గ్రామకార్యదర్శి వి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య పేటలో..

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామ సచివాలయం-2 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి పర్యవేక్షణలో నిర్వహించారు. వైద్య నిపుణులు కె.వినోద, కె.సంతోషికుమారి, కంటి వైద్యుడు మహేశ్వరరావు రోగులను పరీక్షించారు. శిబిరాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ నరసింహ నాయక్ సందర్శించారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా స్థానికులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. రోగులకు వైద్యాధికారి మాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు రేఖారెడ్డి, పెనుమళ్ళ రామిరెడ్డి తదితరులు వైద్య కిట్లు పంపిణీ చేశారు. శిబిరాన్ని హాజరైన వారికి గ్రామ పంచాయతీ ఉద్యోగి కొండలరావు పర్యవేక్షణలో భోజన సదుపాయం కల్పించారు.



రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి మాధవి, రేఖారెడ్డి, రామిరెడ్డి

'నారాయణ'పై విద్యాశాఖ తనిఖీ

- సెలవుల్లో తరగతుల నిర్వహణ
- నోటీసులు జారీ చేస్తామన్న అర్బన్ డీఐ వాణీకుమారి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు ఉల్లంఘించి పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో శుక్రవారం కాకినాడ రామారావు పేటలోని నారాయణ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు అర్బన్ డీఐ వాణీకుమారి శుక్రవారం తెలిపారు. కాకినాడ ఉపవిద్యాశాఖ అధికారి ఆర్జేడీ రాజు ఆదేశాల మేరకు నారాయణ పాఠశాలలో తనిఖీలు చేపట్టారన్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పాఠశాలకు సమీపంలో ఉన్న ఉపాధ్యాయుల ఇళ్లలోను, పాఠశాలలోను తనిఖీలు నిర్వహించామన్నారు. ఆర్జేడీ, ఇన్‌చార్జి డీఈఓ ఆదేశాలను లెక్కచేయకుండా తరగతులు నిర్వహించడంపై పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. విద్యాశాఖ అధికారులు రావడంతో విద్యార్థులను ఇళ్లకు పంపిచేశారన్నారు. విద్యాశాఖ ఆదేశాలు ఉల్లంఘించి ప్రైవేట్ పాఠశాలలు ఎవరైనా శని, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలలో అర్బన్ డీఐ వాణీకుమారి, సీఆర్పీ రత్నకుమారి, డీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులకే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాళ్లరేవు: చొల్లంగిలోని సాల్ట్ భూముల్లో ఇళ్ల స్థలాలను స్థానికులకే కేటాయించాలని కోరుతూ శుక్రవారం ప్రజలు ఆందోళన చేశారు. ఇక్కడి 4.24 ఎకరాల భూమిని ఉప్పలంక ప్రజలకు కేటాయించడం సరికాదని కట్టా త్రిమూర్తులు, గర్రే లక్ష్మీనారాయణ, కనకాల పెదబాబు అన్నారు. అనంతరం తహసీల్దార్ ఎస్.పోతురాజుకు వినతిపత్రం అందజేశారు.

సామాజిక సంకల్పంతో తరలిన నేతలు



కాకినాడ నుంచి విజయవాడ బయలుదేరిన బస్సు వద్ద జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ తదితరులు



తిమ్మాపురం నుంచి బస్సులో వెళ్తున్న ప్రజలు

కాకినాడ సిటీ: సామాజిక న్యాయ మహా శిల్పం పేరిట విజయవాడలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కోసం సిటీ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళిత యువకులు, ఎస్సీ నాయకులు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు సామాజిక సమతా సంకల్ప సభకు 17 బస్సుల్లో తరలివెళ్లారు. ఉదయం 7 గంటలకు ఆయా ప్రాంతాల నుంచి బస్సులు బయలుదేరాయి. పార్టీ నేతలు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు, రోకళ్ల సత్యనారాయణ, మీసాల ఉదయకుమార్, బత్తుల భీమారావు, ఎన్ఎస్ రాజులతో సహా పలువురు ముఖ్య పార్టీనేతలు, నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పార్టీ యువ నాయకులు మల్లిపాముల గణపతి సభకు తరలి వెళ్లేవారికి అల్పాహారం భోజనవసతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూరల్‌లో...

కాకినాడ రూరల్: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభలో పాల్గొనేందుకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఉదయమే కాకినాడ రూరల్, కరప మండలాలు, అర్బన్‌లోని రూరల్ నియోజకవర్గ డివిజన్ల నుంచి బస్సులు, కార్లతో వెళ్లారు. అక్కడకు వెళ్లినవారికి ఎమ్మెల్యే కన్నబాబు అల్పాహారం, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు హనుమంతువజ్ఝల అవధాని, కోట వంశీ, ప్రయాగ రాంబాబు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరాం ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

కాలీఫ్లవర్ సాగు.. లాభాలు బాగు

- దిగుబడిలో ఫ్లవర్ ఫుల్
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- నియోజకవర్గంలో 70 హెక్టార్లలో సాగు



గొల్లప్రోలు మండలం దుర్గాడలో కాలీ ఫ్లవర్ పంట

పిఠాపురం: ఈ ఏడాది కాలీఫ్లవర్ పంట రైతులను లాభాల బాటలో నడిపిస్తోంది. ప్రస్తుతం కూరగాయలకు మంచి గిరాకీ ఉండడంతో నియోజకవర్గంలో వాణిజ్య పంటల సాగు పెరిగింది. మంచి దిగుబడి వస్తుండడంతో రైతులు కాలీ ఫ్లవర్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఆగస్టు నెల నుంచి రైతులు కాలీ ఫ్లవర్ సాగును ప్రారంభిస్తారు. రబీ సీజన్‌లో నవంబరు మొదటి వారంలో సాగు ప్రారంభమవుతుంది. ఈ ఏడాది రెండు వారాలు ఆలస్యంగా సాగు ప్రారంభించడంతో పంట చేతికి వచ్చే సమయం లోనూ ఆలస్యమైంది. అయినప్పటికీ ధర బాగుడటంతో లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఇటీవల పచ్చ పురుగు తాకిడి ఎక్కువగా ఉండడంతో కొంత వరకు దిగుబడి తగ్గింది. ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి, భూమి లీజు రూ.10 వేలతో కలిపి ఎకరానికి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుండగా రూ.లక్ష వరకూ ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇటీవల ఒక్కో పువ్వు ధర రూ.20 నుంచి రూ.25 వరకు పలుకుతోంది.



విరవాడలో కాలీ ఫ్లవర్ రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానశాఖాధికారి శైలజ

నియోజకవర్గంలో...

పిఠాపురం నియోజకవర్గంలోని విరవ, విరవాడ, మంగితుర్తి, మల్లాం, చెందుర్తి, దుర్గాడ తదితర ప్రాంతాల్లో సుమారు 70 హెక్టార్లలో రైతులు కాలీఫ్లవర్ సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉండడంతో కోతలను ముమ్మరం చేశారు. నిత్యం 30 నుంచి 40 వేల వరకు కాలీ ఫ్లవర్లను పిఠాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం, తుని, రామచంద్రపురం, అమలాపురం తదితర ప్రాంతాలతో పాటు విశాఖ, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, గుంటూరు జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.

ధర బాగుంది

రెండు వారాలకు ముందు ఒక్కో పువ్వు ధర రూ.25 వరకూ పలికింది ఇప్పుడు రూ.20 మాత్రమే పలకడంతో కొంత మేర ఆదాయం తగ్గిపోయింది. పచ్చ పురుగు వల్ల పురుగు మందులు ఎక్కువగా పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి ఖర్చు కూడా పెరిగింది. అన్ని చోట్ల కోత ఒక్కసారిగా ప్రారంభించడంతో వ్యాపారులు రేటు తగ్గించేస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి ఆశాజనకంగానే ఉన్నా ధర తగ్గడం వల్ల కొంత నిరాశ చెందుతున్నాం. మార్కెట్‌లో గిరాకీ ఉన్నా వ్యాపారులే ధరలు తగ్గించేస్తున్నారు. తద్వారా మాకు లాభాలు తగ్గుతున్నాయి.

కందా సూర్యనారాయణ, రైతు, మంగితుర్తి, పిఠాపురం మండలం

ఆశాజనకంగా దిగుబడి

ప్రస్తుతం కాలీ ఫ్లవర్ దిగుబడి ఆశాజనకంగా ఉంది. ప్రభుత్వం రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సూచనలు, సలహాలు ఇస్తోంది. రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించేలా చూడడం వల్ల మంచి దిగుబడులు వస్తున్నాయి. ఇటీవల రేటు బాగా పెరిగినప్పటికీ ప్రస్తుతం కొంత తగ్గింది. మళ్లీ పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పచ్చ పురుగు పంటను ఆశించడంతో మేము, మా సిబ్బంది పరిశీలించి రైతులకు తగిన సస్యరక్షణ చేపట్టేలా సూచనలు ఇస్తున్నాం. రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి వారి పంటలను వాళ్లే దూర ప్రాంతాలకు ఎగుమతులు చేసుకునేందుకు వీలుగా కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌ల ఏర్పాటుకు 75 శాతం రాయితీపై అవకాశం కల్పిస్తున్నాం.

శైలజ, ఉద్యానశాఖాధికారి, పిఠాపురం



ఆశాజనకంగా పండిన కాలీ ఫ్లవర్

అక్రమ మద్యం పట్టివేత



అక్రమ మద్యంతో పట్టుబడ్డ మహిళతో ఎక్సైజ్ అధికారులు

పెద్దాపురం: అనధికారికంగా అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు కాకినాడ డీటీఎఫ్ సీఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ పాత పెద్దాపురానికి చెందిన కుమారి, సోమశేఖర్‌లను అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. వారి నుంచి సుమారు 59 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.